క్లుప్తంగా

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ల మంజూరు



మూలపేటలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెల్లయ్యనాయుడు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. శనివారం ఆయన మూలపేటలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడుతో కలిసి పింఛన్‌లు పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి పింఛన్‌ను రూ.3వేలకు పెంచి పంపిణీ చేస్తారన్నారు. సచివాలయ కన్వీనర్ ఆదికుమార్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఫౌండేషన్ ఉపకార వేతనాల పంపిణీ



మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనం అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ శ్రీవల్లి

మునగపాక : ఎస్‌బీఐ ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక ఎస్‌బీఐ మేనేజర్ శ్రీవల్లి కోరారు. అరబుపాలెం గ్రామ సేవా కేంద్రం వద్ద శనివారం మెరిట్ విద్యార్థులకు ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా నలుగురు విద్యార్థులకు రూ.5వేల వంతున రూ.20 వేల మేర ఉపకార వేతనాలు అందజేశారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, సంస్థ ప్రతినిధి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సహకార సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న నాగులాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు

మునగపాక : సహకార సంఘ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నాగులాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు కోరారు. అంతర్జాతీయ సహకార దినోత్సవ సందర్భంగా శనివారం నాగులాపల్లి సొసైటీలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సహకార సంఘం ద్వారా మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమణమూర్తి మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా బహుళార్థ సేవలందించే నిమిత్తం కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం 86 మంది రైతులకు రూ.23 లక్షల మేర వ్యవసాయ రుణాలు అందజేశారు. సంఘ డైరెక్టర్లు బాబూరావు, ఎర్రయ్యనాయుడు, సీఈవో స్వామి పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో గ్రామసభ

మునగపాక : వాడ్రాపల్లి గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. వాడ్రాపల్లి సచివాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న వార్షికోత్సవం



స్వామివారి సన్నిధిలో భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని అందలాపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా విచ్చేసి స్వామి వారికి పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

‘జగనన్న సురక్ష’తో అర్హులందరికీ లబ్ధి

- కార్యక్రమానికి విశేష స్పందన
- అట్టహాసంగా ప్రారంభం
- గ్రామసభల్లో వివిధ ధ్రువపత్రాల పంపిణీ



తెరువుపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



కాగితలో దరఖాస్తుదారుకు ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



పాయకరావుపేటలో అర్హులకు ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు



వేంపాడులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

నక్కపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నక్కపల్లి మండలంలో వేంపాడు, కాగిత సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ ఈవోపీఆర్‌డీ ఒక బృందంగాను, ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్‌ల నేతృత్వంలో మరో బృందాన్ని ఏర్పాటు చేసి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కుల, నివాస, ఆదాయ, జనన, మరణ, ధ్రువపత్రాలతోపాటు, వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు కావాలని ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఆధార్‌కు ఫోన్ నెంబరు లింక్ చేయడం, మ్యూటేషన్‌ల కోసం కూడా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో వివాహ, కుల ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే మంజూరు చేశారు. వేంపాడు, కాగిత గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రుపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాలన ప్రజల వద్దకే తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నక్కపల్లి మండలంలో వేంపాడులో మొత్తం 694 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రాల కోసం 322, ఆదాయ ధ్రువపత్రాల కోసం 322, రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు కోసం 13, మ్యూటేషన్ కోసం1, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం కోసం 26 దరఖాస్తులు వచ్చాయి. కాగితలో మొత్తం 658 దరఖాస్తులు రాగా, వీటిలో కుల ధ్రువపత్రాలు 321, వివాహ రిజిస్ట్రేషన్ కోసం 3, ఆదాయ ధ్రువపత్రాల కోసం 322, రేషన్ కార్డుల కోసం 12 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలతో పాటు, ఆధార్ అనుసంధానం సర్టిఫికేట్లు వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు గ్రామసభలో లబ్ధిదారులకు అందజేశారు. రెండు గ్రామాల్లోను 1352 దరఖాస్తులు రాగా 1347 దరఖాస్తులు పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎఫ్‌యుఐడీసీ డైరక్టర్ వీసం రామకృష్ణ,ఎంపిపి ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్‌ఎంపిపిలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, సర్పంచ్‌లు రాజేష్, నూకరత్నం, వరహాలు, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు, డీటీ నీరజ, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ ఎంపీటీసీ చంద్రరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాపారావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శీరం నర్సింహమూర్తి, స్థానిక నాయకులు పోతంశెట్టి బాబ్జి, దేవవరపు శివ, సురేష్ వర్మ పాల్గొన్నారు.

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో మంచి కార్యక్రమని, పేదలకు ఎంతో రక్ష అని మండల ప్రత్యేక అధికారి సి.హెచ్.లచ్చన్న అన్నారు. పాయకరావుపేట సచివాలయం -1, పి.ఎల్.పురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. పాయకరావుపేట సచివాలయం 1 నందు మండల తహసీల్దార్ టీమ్ సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పాయకరావుపేట సచివాలయం 1లో 304 అర్జీలను (టోకెన్‌లను) నమోదు చేశారు. ఆయా అర్జీలను నమోదు చేసుకున్న వారికి ధ్రువపత్రాలు మండల ప్రత్యేక అధికారి లచ్చన్న, తహసీల్దార్ కె.జయప్రకాష్, గ్రామ సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్ చేతుల మీదుగా అర్జీదారులకు అందించారు. పాయకరావుపేట సచివాలయం1లో 148 ఇంటిగ్రేటెడ్ ధ్రువీకరణ పత్రాల కోసం, 146 ఆదాయ ధ్రువపత్రాలకు ధృవీకరణ పత్రాలకు అర్జీలు నమోదు చేసి, వారందరికీ ధ్రువపత్రాలు అందజేశామని తహసీల్దార్ కె.జయప్రకాష్ తెలిపారు. పీఎల్ పురం గ్రామంలో ఎంపీడీవో ఎ.సాంబశివరావు బృందం సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 89 సమస్యలను గ్రామ వలంటీర్లు నమోదు చేశారు. కుల, ఆదాయ, రైస్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య శ్రీ, ఆధార్ నమోదు తదితర 11 రకాల సేవలను నమోదు చేశారు. ఎంపీడీవో సాంబశివరావు, సర్పంచ్ సోమన్నదొర, డీటీ నూకరాజు చేతుల మీదుగా అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. పాయకరావుపేట సచివాలయం-1 వద్ద జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ సాయి బాబా, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీను, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మాధవి తిరుమల్లేశ్వరావు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు. పి.ఎల్.పురం గ్రామంలో జరిగిన సమావేశంలో గ్రామ కార్యదర్శి మూర్తి, పి.ఆర్.ఎ.ఈ. కచేరి, హౌసింగ్ డిఈ విజేయుడు పాల్గొన్నారు.

సురక్ష .. ప్రజలకు రక్ష : ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి : జగనన్న సురక్ష ప్రజలకు రక్షగా నిలుస్తుందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. శనివారం యలమంచిలి మండలంలో కృష్ణాపురం గ్రామంలో మొదటిసారిగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపలో ప్రజల సమస్యలు విని పరిష్కరించడానికి ఇది ఒక సువర్ణావకాశం అని అన్నారు. దరఖాస్తుదారులకు కుల, నివాస ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువపత్రాలు, మ్యుటేషన్, కుటుంబ ధ్రువపత్రాలు, ఆధార్‌కు మొబైల్ లింక్, పంట సాగు హక్కు పత్రాలు, నూతన బియ్యం కార్డులు తదితర 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అర్హులైన వారికి అందజేయడం జరుగుతుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విధంగా ఎటువంటి పత్రం కావాలన్న లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని, ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా నేరుగా సచివాలయం ద్వారా అన్ని సేవలు అందుతున్నాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని, వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలందిస్తున్నారని అన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుప్తా, నాగేశ్వరరావు, వైయస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, ఎంపీడీవో అప్పలనాయుడు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ పాల్గొన్నారు.



తెరువుపల్లిలో ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఒక్కరోజులో ధ్రువపత్రం అందించారు



మా అబ్బాయిని పాఠశాలలో చేర్పడం కోసం కులం, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు కావాల్సి ఉంది. నాలుగురోజుల క్రితం అధికారులు వస్తే ఈ విషయం చెప్పేను. మా దగ్గర కాగితాలు తీసుకున్నారు. ఒకటో తేదీన సచివాలయం దగ్గరకు రమ్మన్నారు. ఈ రోజు వస్తే మాకు కావాల్సిన సర్టిఫికేట్లు ఇచ్చేరు. చాలా ఆనందంగా ఉంది. జగనన్న పాలనలో మేం ఎక్కడికీ తిరక్కుండానే అన్నీ ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారు. **–మంగ, వేంపాడు,** నక్కపల్లి మండలం

జగనన్న సురక్ష ఎంతో మేలు



నేను ఇటీవలే వివాహం చేసుకున్నాను. వివాహ రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్టార్ కార్యాలయాలకు తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు ఇంటి వద్దకే వచ్చి వివరాలు కావాల్సిన పత్రాలు తీసుకున్నారు. కేవలం నాలుగురోజుల వ్యవధిలోనే గ్రామసభలో నాకు వివాహ ధ్రువీకరణపత్రం అందజేశారు. చాలా ఆనందంగా ఉంది. జగనన్న సురక్ష కార్యక్రమం మాలాంటి పేదలకు ఎంతో మేలు చేకూరుస్తుంది. **–ప్రగడ నాగవంశీ,** సిహెచ్‌బి అగ్రహారం, నక్కపల్లి మండలం

ఎంతో మంచి కార్యక్రమం



జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో మంచి కార్యక్రమం. మీ సేవ కేంద్రాలకు, సచివాలయాలకు, మండల కార్యాలయాలకు తిరగకుండా సమస్యలు గ్రామంలో ఇంటికి వచ్చి నమోదు చేసుకుని, పరిష్కరించడం ఎంతో ఆనందంగా ఉంది.

–మందపల్లి సత్యవతి, పీఎల్ పురం, పాయకరావుపేట మండలం

ఉచితంగా సేవలందించారు



జగనన్న సురక్ష కార్యక్రమం ఎక్కడికీ వెళ్లకుండా సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కరించడం ఎంతో సంతోషంగా ఉంది. నేను ఆధార్ నంబర్‌కి ఫోన్ నెంబరు అనుసంధానం చేయించుకున్నాను. ఎలాంటి రుసుము లేకుండా సేవలందించారు.

–ఎం.దుర్గాభవాని, పి.ఎల్.పురం, పాయకరావుపేట మండలం

ఏ ఇంటిలోనూ సమస్య ఉండకూడదు



రాజుపేటలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : ఏ ఇంట్లో కూడా సమస్య కనిపించకూడదనే నిశ్చయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. రాజుపేట సచివాలయ పరిధిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శనివారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లపు కుమారరాజా ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరు చేయాలని, పింఛను రాలేదని పలువురు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 39 మంది రైతులు గత ప్రభుత్వ హయాంలో మినీ గోకులం షెడ్లు నిర్మించారని, వాటికి సంబంధించిన నిధులు కొందరు రైతులకు అందలేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎంపీయూపీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, యల్లపు సత్యనారాయణ, బాబూరావు, వెంకట రమణ, సూరిశెట్టి ప్రసాద్, శెట్టి రమణ, రామునాయుడు, రమణమూర్తి, చిట్టిబాబు, పైల నాని, ఆంజనేయులు, ఎంపీటీసీలు పెట్ల రాంబాబు, వంగలపూడి రాంబాబు, కో ఆప్షన్ మెంబర్ ఖుదా భాషా, మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు, ఏవో చంద్రశేఖర్, డీటీ సోమశేఖర్, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ నారాయణరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో జగనన్న సురక్ష

ఎస్.రాయవరం : జగనన్న సురక్షతో పేదవాడికి రక్షణ కలిగిస్తోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తిమ్మాపురం 1, ఎస్.రాయవరం 1 సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ధ్రువపత్రాలు అవసరం ఉన్న వారికి ఉచితంగా అందించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సభలు సమస్యల పరిష్కారానికి వేదికగా మార్చాలన్నారు. ఇంకా అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి గోవిందు, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీపతి, సర్పంచ్ సత్యనారాయణ, అప్పారావు, మాజీ ఎంపీపీ శారదాకుమారి, మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు పెద ఈశ్వరరావు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిస్తున్నారు..



చౌడువాడలో ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత సమాజాన్ని నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. చౌడువాడలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేసి మాట్లాడారు. దేశ చరిత్రలో ఇలా ధ్రువ పత్రాలు అందించడం ఎక్కడైనా చూశారా? అని ఎమ్మెల్యే బాబూరావు ప్రశ్నించారు. సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయడం ఓ చరిత్ర కాగా, 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఇలా వారి గ్రామంలోనే ఒక్క రోజులో అందజేయడం ఊహకు అందని ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమం మిగతా రాష్ట్రాలకు మార్గదర్శకం అవుతుందన్నారు. కార్యక్రమంలో 289 దరఖాస్తులను పరిష్కరించి 285 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, తహసీల్దారు జానకమ్మ, ఏవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ గోపాలకృష్ణ, పార్టీ నాయకులు సత్యనారాయణ, రాము నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

బొడ్డేడకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక : పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులు కావడమే ఇందుకు నిదర్శనం అన్నారు. మునగపాక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షునిగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్‌కు ఘన స్వాగతం పలికేందుకు ఆదివారం భారీ బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నామని, శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని ఆదివారం అనకాపల్లికి తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్న ప్రసాద్‌కు స్వాగతం పలికేందుకు కార్యకర్తలు తరలి రావాలని అన్నారు. ర్యాలీ రైల్వేస్టేషన్ నుంచి బెల్లం మార్కెట్ మీదుగా చిన నాలుగురోడ్ల జంక్షన్, నెహ్రూచౌక్, అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా మునగపాక నందీశ్వర ప్రాంగణానికి చేరుకొని అక్కడ సభ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, గంగప్పలనాయుడు, పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, పొలిమేర గణేష్, దాసరి అప్పారావు రామ్మోహనరావు, పిల్లి అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, శరగడం జగన్నాథరావు, జగన్, గుంట్ల అప్పారావు, మొల్లేటి శంకర్, మందా రాము, వినోద్, కాశీబాబు పాల్గొన్నారు.

తొలిరోజు ‘సురక్ష’కు విశేష స్పందన

మునగపాక : మండలంలోని చూచుకొండ, చెర్లోపాలెం సచివాలయాల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన కనిపించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయి. వలంటీర్లు, గృహ సారథులు.కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు ఇటీవల ఇంటింటికీ వెళ్లి చేపట్టిన సర్వే మంచి ఫలితాలు ఇస్తుంది. సర్వే ద్వారా వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం కనిపించడంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వినిపిస్తున్నాయి. చెర్లోపాలెం సచివాలయం నుంచి 266 మందికి పలు సేవలందించారు. 163 మందికి ఇంటిగ్రేటెడ్ పత్రాలు, 31 ఆదాయ ధ్రువీకరణ, 3 ఫ్యామిలీ మెంబర్ పత్రాలు, 61 ఆధార్ లింక్, 7 రేషన్ కార్డులకు, హౌస్ హోల్డ్స్ 1 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. చూచుకొండ సచివాలయ పరిధిలో 287 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 177 ఇంటిగ్రేటెడ్, మ్యుటేషన్‌కు 1, మేరేజ్ ధ్రువీకరణకు 1, ఆదాయ ధ్రువీకరణ 28, ఫ్యామిలీ సర్టిఫికేట్‌కు 1,మొబైల్‌కు ఆధార్ అనుసంధానం 76, రేషన్‌కార్డులు 3 వెరసి 287 పత్రాలను అందజేశారు.

కట్టుబోలులో...

రాంబిల్లి : జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. కట్టుబోలు, మురకాడ సచివాలయాల్లో శనివారం ఆయన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగనన్నకు అండగా నిలవాలన్నారు. పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అర్జీదారులకు ఉచితంగా అందజేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జడ్పీటీసీ నాగరాజు, ఎంపీపీ శిరీష శ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డీఎస్ఎన్ రాజు, అప్పన్నదొర, బాబూరావు, మండల ప్రత్యేకాధికారి ప్రసాద్, ఎంపీడీవో కొండలరావు పాల్గొన్నారు.

రేపు సామూహిక హారతి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 3న ఆషాఢ మాస శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని అన్ని దేవాలయాల్లోనూ సామూహిక హారతి నిర్వహించాలని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు సూచించారు. అచ్యుతాపురంలోని శ్రీకృష్ణ, శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన సమరసతా సేవా ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుడివాడ రమణ, మండల కో కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు, లాలం నాని పాల్గొన్నారు.

రసాయన ఎరువులతో అనర్థాలు

రాంబిల్లి : మర్రిపాలెంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు వినియోగంతో కలిగే అనర్థాలను ప్రకృతి వ్యవసాయం విభాగం ప్రతినిధి శ్యామల వివరించారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభించడమేగాక నేల స్వభావం దెబ్బతినకుండా వుంటుందని సర్పంచ్ ఎం. బాబూరావు అన్నారు.

తెలిమబ్బుల సోయగం



అరుణకాంతుల ఆకాశవేదులో...తెలిమబ్బు తెరలు తేలియాడినట్టు... మునగపాకలో శనివారం ఆకాశం ఆకట్టుకునే రంగులతో కళకళలాడింది..చూపరులకు కనువిందు చేసింది.

–మునగపాక

ప్రజల ముంగిటకే సేవలు



మునగపాక మండలంలో అర్జీదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక : జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ అన్నారు. మండలంలోని చూచుకొండ, చెర్లోపాలెం గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన అర్హులైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అర్హులై ఉండి ఇంతవరకు ఎటువంటి సంక్షేమం పొందని వారికి మంచి అవకాశం దక్కిందన్నారు. జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్ కుమార్, వైస్ ఎంపీపీ బోజాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీడీవో మన్మథరావు, తహసీల్దార్ ప్రకాశరావు, ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

యలమంచిలిలో క్రీడలకు ప్రోత్సాహం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : క్రీడలు శారీరక దృఢత్వానికి ఎంతో తోడ్పడతాయని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. మున్సిపాలిటీ పరిధి పెదపల్లి గ్రామంలో గత నెలలో వేమాంబిక జాతర సందర్భంగా జిల్లా స్థాయి ఎమ్మెల్యే క్రికెట్ కప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లా నలుమూల నుంచి 48 జట్లు పాల్గొన్నాయి.

ఈ పోటీల్లో పెదపల్లి జట్టు ప్రథమస్థానం, రేవు పోలవరం జట్టు ద్వితీయ స్థానం పొందాయి. విజేతలకు శనివారం ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యలమంచిలి నియోజకవర్గంలో క్రీడామైదానాలు తన హయాంలోనే అభివృద్ధి చెందాయని పట్టణంలో క్రీడలను ఎక్కువగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, పట్టణ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, కౌన్సిలర్ దాసరి కుమార్ పాల్గొన్నారు.